క్లుప్తంగా

అండర్ -19 మహిళా క్రికెట్ జట్టుకు స్పందన



కృష్ణ స్పందన

గోపాలపురం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్ -19 మహిళా క్రికెట్ జట్టుకు గోపాలపురం మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన ఆలపాటి కృష్ణ స్పందన ఎంపికైంది. ఈ విషయాన్ని ఆమె బుధవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 9న ఏలూరులో నిర్వహించిన ఎంపిక పోటీల్లో తాను ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 23న మంగళగిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఫాస్ట్ బౌలర్‌గా వ్యవహరించనున్నట్టు స్పందన పేర్కొంది.

రేపు కోటసత్తెమ్మ వారికి ఆషాఢం సారె

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారికి ఈనెల 14 వతేదీ శుక్రవారం ఆషాఢ మాసం సారె సమర్పించనున్నట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) బుధవారం తెలిపారు. నిడదవోలు గణపతి సెంటర్ నుంచి వైభవోపేతంగా మంగళ వాయిద్యాలతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఉప ముఖమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని ఈఓ పేర్కొన్నారు.

దేవరపల్లిలో జోరుగా పారిశుధ్య పనులు



దేవరపల్లి దళితవాడలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ కడిమి వీరకుమారి

దేవరపల్లి: దేవరపల్లి పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. చెదురుమదురుగా వర్షాలు కురువడంతో మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైన్లు శిథిలం కావడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో గ్రామ పంచాయతీ పారిశుధ్య పనులపై దృష్టి పెట్టింది. అదనపు కార్మికులను ఏర్పాటు చేసి దళితవాడలో డ్రైన్లను శుభ్రం చేయిస్తున్నారు. శిథిలమైన అండర్ గ్రౌండ్ పైపులను తొలగించి మురుగునీరు ప్రవాహానికి అటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పారిశుధ్య పనులకు బుధవారం సర్పంచ్ కడిమి వీరకుమారి, కార్యదర్శి నిట్టా రవికిషోర్ పర్యవేక్షించారు.

పాఠ్యాంశాల బోధన అర్థమయ్యేలా ఉండాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న జిల్లా సెక్టోరియల్ అధికారి నరసింహారెడ్డి

గోపాలపురం: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన ఉండాలని జిల్లా సెక్టోరియల్ అధికారి, ఎంఐఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.నరసింహారెడ్డి సూచించారు. అవసరమైతే విద్యార్థులను గ్రేడుల వారీగా ఎంపిక చేసి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామంలోని ఎంపీ యూపీ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు సలహాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించిందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం. రత్నమణి, సీఆర్పీ కొయ్య నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి గుర్తింపు తేవాలి

గోపాలపురం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి, ఆసుపత్రికి గుర్తింపు తీసుకురావాలని స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నిర్వహించారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ తన ప్రసంగంలో ఈ సీహెచ్‌సీకి అవసరమైన వైద్యులు, పరికరాలను ఏర్పాటు చేసిన కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావులకు కృతజ్ఞతలు తెలిపారు. రోగులను చూడడానికి వచ్చే బంధువులకు విశ్రాంతి భవనం నిర్మాణానికి మండల పరిషత్ నిధులు కేటాయిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు పెనుగొండ బాలాజీ, గెల్లా వెంకట శ్రీను, వైద్యుడు కె.సతీష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ పవర్ సమస్యకు త్వరలో పరిష్కారం

దేవరపల్లి: లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ దోనేల్లి ధనలక్ష్మి చెక్ పవర్ సమస్యను త్వరలో పరిష్కరిస్తానని పంచాయతీరాజ్ శాఖా మంత్రి బూడి ముత్యాలనాయుడు హామీ ఇచ్చినట్టు వైఎస్సార్ సీపీ దేవరపల్లి మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తెలిపారు. సతీష్, లక్ష్మీపురం సర్పంచ్ ధనలక్ష్మి భర్త జానకీరామ్ బుధవారం సాయంత్రం విజయవాడలో మంత్రి ముత్యాలనాయుడిని కలిసి చెక్ పవర్ సమస్యను వివరించారు. ఈ క్రమంలో మంత్రి పైహామీ ఇచ్చారని సతీష్ చెప్పారు.

సరిలేరు మీకెవ్వరు..

- ప్రభుత్వానికి, సామాన్యులకు మధ్య సంధానకర్తలు
- పేదల అవసరాలు తీర్చే సేవాతత్పరులు
- వలంటీర్ల సేవలకు సర్వత్రా ప్రశంసలు

నిడదవోలు రూరల్/ నిడదవోలు/కొవ్వూరు: ప్రభుత్వానికి, సామాన్య పౌరులకు మధ్య సంధానకర్తలు వలంటీర్లు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అట్టడుగు వర్గాల ప్రజల అవసరాలు తెలుసుకుంటున్నారు. అంతేకాదు.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేదలకు వివరిస్తున్నారు. అర్హులతో స్వయంగా దరఖాస్తు చేయించి, ఆయా పథకాల వారికి లబ్ధి చేకూరేలా చేస్తున్నారు. సరిలేరు మీకెవ్వరూ అనే రీతిలో సేవలు అందిస్తున్నారు. కులం, మతం, రాజకీయాల ప్రమేయం లేకుండా గత నాలుగేళ్లుగా ప్రభుత్వ పథకాలు అర్హులు అందరికీ అందుతున్నాయంటే నిస్సందేహంగా అది వలంటీర్ల చలవే. ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే వలంటీర్లు తలుపు తట్టి లబ్ధిదారులకు ఠంచన్‌గా పింఛను అందిస్తున్నారు. బియ్యం కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేని వారి నుంచి అవసరమైన పత్రాలు సేకరించి సచివాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయించి మంజూరు చేయిస్తున్నారు. వ్యాక్సినేషన్, ఆరోగ్య పరీక్షల సమాచారాన్ని ముందుగానే చేరవేసి ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. గ్రామాల్లో తాగు నీరు, డ్రైన్లలో పూడిక, వీధిలైట్ల సమస్య వంటి వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు, చేపట్టే కార్యక్రమాల గురించి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు వివరిస్తున్నారు. అంతేగాక కరోనా, ఎర్రకాలువ, గోదావరి వరదల వంటి విపత్తుల వేళ వలంటీర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలు అందించి ప్రశంసలు అందుకున్నారు. వారి సేవలు ఎలాంటివో వాటిని పొందిన లబ్ధిదారుల మాటల్లోనే..

వలంటీర్ వల్లే మాకిన్ని పథకాలు



నాపేరు వస్మా మేరీ కమలమ్మ. గాంధీ నగర్ రెండో వీధిలో నివాసం. మా వలంటీర్ పేరు సంగాడ తరుణ్. కొన్ని నెలల క్రితం ఆయన మా ఇంటికి వచ్చి అన్ని ధ్రువీకరణ పత్రాలు తీసుకుని దరఖాస్తు చేయించారు. నాకు జ్యోతి కాలనీ లేఅవుట్‌లో ఇంటి స్థలం వచ్చింది. ఇల్లు కట్టుకున్నాం. త్వరలోనే గృహ ప్రవేశం. నా భర్త చిరు వ్యాపారి. మా అత్తగారైన పద్మకు ఆసరా పథకంలో లబ్ధి చేకూరింది. ప్రతి నెలా వలంటీర్ మా ఇంటికి వచ్చి మా మామగారైన వెంకట్రావుకు పింఛను ఇస్తున్నారు. మేం ఎక్కడికీ వెళ్లకుండా అన్ని పథకాలు ఇంటికే వస్తున్నాయంటే అది వలంటీర్ చలవే.

– వస్మా మేరీ కమలమ్మ, గాంధీనగర్, నిడదవోలు

దరఖాస్తు చేయించి ఇల్లు ఇప్పించారు



మాది పేద కుంటుంబం. సొంతిల్లు కూడా లేదు. ఏళ్ల తరబడి అద్దె ఇంటిలోనే తలదాచుకుంటున్నాం. పరిస్థితిని మా ఇంటికి వచ్చిన వలంటీర్ మైలవరపు పాపకు చెప్పాం. ఆమె సాయంతో దరఖాస్తు చేసుకుంటే ఇల్లు మంజూరైంది. మాకిద్దరు ఆడపిల్లలు. మా పెద్దమ్మాయికి నాలుగేళ్లుగా అమ్మఒడి సాయం అందుతోంది. అమ్మ ఒడి సాయానికి అర్హురాలినని మా వలంటీరే గుర్తించి దరఖాస్తు చేయించింది. అలాగే వలంటీర్ మా ఇంటికి వచ్చి వైఎస్సార్ బీమా చేయించారు. ప్రతినెలా రేషన్ వస్తున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు వలంటీర్ తెలియజేస్తున్నారు. ఓట్ల నమోదు, కరోనా సమయంలో వ్యాక్సిన్ సమాచారం, ప్రభుత్వం ద్వారా చేకూరే అన్ని పథకాల సమాచారాన్ని అందిస్తున్నారు.

– నందిపల్లి పార్వతి, 23వ వార్డు, కొవ్వూరు

వృద్ధాప్యంలో అండగా..



వృద్ధురాలిని కావడంతో ఎక్కడికీ వెళ్లలేను. మాలాంటి వారికి వలంటీర్ సేవలు వరంలా మారాయి. మా వలంటీర్ పేరు షేక్ వహీదా. కుటుంబ సభ్యురాలి మాదిరిగా అండగా నిలుస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఠంఛనుగా ఇంటికి వచ్చి పింఛను సొమ్ము అందిస్తోంది. కరోనా సమయంలో బంధువులు ఎవరూ మా వద్దకు రావడానికి భయపడేవారు. కానీ ఆ సమయంలో వలంటీర్ చేసిన సేవలను మాత్రం మరిచిపోలేం.

– పేరాబత్తుల సారమ్మ, 25వ వార్డు, నిడదవోలు

తల్లిదండ్రుల్లా చూసుకుంటుంది



మాకు ముగ్గురు పిల్లలు. ప్రస్తుతం ఇద్దరు అమ్మాయిలు మా వద్ద లేరు. మా వలంటీర్ కూచిపూడి నాగదుర్గ మమ్మల్ని తల్లిదండ్రుల్లా చూసుకుంటుంది. నా భార్య రత్నానికి మొదట వైఎస్సార్ చేయూత రాలేదు. వలంటీర్ ఆమెను తీసుకువెళ్లి ఆధార్‌కు ఫోన్ నంబర్ లింకేజీ చేయించింది. దాంతో చేయూత సొమ్ము ఖాతాకు జమ అయ్యింది. జగనన్న చేదోడుకు మాతో వలంటీర్ దరఖాస్తు చేయించడంతో రూ.10 వేల రుణం వచ్చింది. ఆ సొమ్ముతో ఇంటి వద్దే ఎండు చేపల వ్యాపారం పెట్టుకున్నాం. 2020 చివర్లో ఎర్రకాలువ వరదలకు మా ఇల్లు మునిగిపోతే వలంటీర్ మాకు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో ఆశ్రయం కల్పించింది. ఇల్లు దాటి బయటకు వెళ్లకుండానే నాగదుర్గ నాకు పింఛను మంజూరు చేయించింది.

– మావుళ్లపల్లి సూర్యారావు, తాళ్లపాలెం

వలంటీర్ కాదు.. సోదరుడి మాదిరి



మాకు సొంతిల్లు లేదు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లోనే నివసించేవాళ్లం. మా వలంటీర్ షేక్ ఆలీ అబ్బాస్ నాకు తమ్ముడి కంటే ఎక్కువ. నా ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకువెళ్లి నాకు స్థలం మంజూరు చేయించాడు. నా భర్త పాస్టర్ కావడంతో రూ.5 వేల గౌరవ వేతనానికి దరఖాస్తు చేయించాడు. నాకు కరోనా వచ్చినపుడు వలంటీరే అబ్బాస్ స్వయంగా నాకు ట్యాబ్‌లెట్లు, కూరగాయలు తీసుకువచ్చాడు. జగనన్న అమలు చేస్తున్న ఎన్నో పథకాలు వలంటీర్ల వల్ల పేదలకు అందుతున్నాయి.

– గోపిశెట్టి పోశమ్మ, సమిశ్రగూడెం

పైడిమెట్ట వాసిపై రెండు వేర్వేరు ఫిర్యాదులు

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్టకు చెందిన జొన్నకూటి వినోద్‌కుమార్ అనే వ్యక్తిపై తాళ్లపూడి పోలీసులకు రెండు వేర్వేరు ఫిర్యాదులు అందాయి. కాగా వినోద్‌కుమార్ కొద్ది నెలల క్రితం విద్యుత్ షాక్‌తో చనిపోయిన దర్శిత్ అనే చిన్నారి తండ్రి. దర్శిత్ ఘటన నేపథ్యంలో వినోద్‌కుమార్ కుటుంబంపై తామంతా సానుభూతితో ఉన్నామని, సాటి సామాజికవర్గం వారిగా తమకు తోచిన విధంగా ఆదుకున్నామని అక్కడి వారు తెలిపారు. అయితే ఇటీవల ఆ కుటుంబం తమ గ్రామస్తులందరినీ దూషిస్తూ, తమ పిల్లలకు శాపనార్థాలు పెడుతున్నారంటూ బుధవారం తాళ్లపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కొప్పాక పోశియ్య, పసలపూడి రామారావు, కొప్పాక రవీంద్ర, ప్రసాద్, కె.వెంకటరావు, పి. రాంబాబు తదితరులు ఉన్నారు. కాగా దర్శిత్ తండ్రి వినోద్ తమపై దాడి చేసినట్టు ప్రక్కిలంక గ్రామంలోని పెట్రోల్ బంక్ యజమాని ఆత్కూరి రాంబాబు, ఆయన మనువడు ఫిర్యాదు చేశారు. బంక్ అద్దాలు పగలగొట్టడంతో పాటు, తమ పై దాడి చేశారని ఆత్కూరి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె. వెంకటరమణ తెలిపారు.

15న కొవ్వూరు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు: కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 15వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో కె.సుశీల బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అధ్యక్షత వహిస్తారని చెప్పారు. కావున ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఇల్లు లేని వారంటూ ఉండకూడదు

- అవసరమైతే పొలాలు కొనుగోలు చేస్తాం
- మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: ఏ పేదవాడూ భవిష్యత్తులో 'నాకు స్థలం లేదు. ఇల్లు లేదు'. వంటి మాటలు చెప్పే పరిస్థితి రాకుండా చేద్దామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గృహాలు కావాలంటూ అర్హులు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నా తీసుకోవాలని, అలాంటి వారికి స్థలం చూపించే బాధ్యత తనదని ఎమ్మెల్యే అన్నారు. అవసరమైతే మరిన్ని ఎకరాల పొలం కొని, ఇళ్ల స్థలాల లేఅవుట్లు చేసే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తలారి మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 117 జగనన్న లేవుట్లు ఉండగా, వాటిలో 57 చోట్ల బోర్లు వేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ జరుగుతోందని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. కొన్నిచోట్ల పైపులైన్లు వేస్తున్నట్టు చెప్పారు. లేఅవుట్లలో విద్యుత్తు స్తంభాలు వేసే ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. వైఎస్సార్ జలకళ పథకంలో 500 బోర్లకు 350 ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. అవసరమైతే మరిన్ని బోర్లు తీసుకు వస్తానన్నారు. జల్‌జీవన్ మిషన్ రెండు దశలలో మంజూరైన రూ.40 కోట్ల వ్యయంతో ఇంటింటికీ ఉచిత కుళాయిలు ఇచ్చే పనులు జరుగుతున్నాయన్నారు.

పోతవరం హైస్కూల్లో జూనియర్ కళాశాల

పోతవరం హైస్కూల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే తలారి చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు చేపట్టామన్నారు. పోతవరం కొత్తపేటలో నూతన పాఠశాల ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. తల్లులు లేని పిల్లలకు అమ్మఒడి సాయం మంజూరుకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో పలువురు సభ్యులు కోరారు. గ్రామాల్లో పాత విద్యుత్తు స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని, డప్పు కళాకారులను గుర్తించే విషయంలో పంచాయతీ సర్పంచులకు అధికారం ఇవ్వాలని మరికొందరు సభ్యులు కోరారు. అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కొందరు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. ఎంపీడీఓ రాజశేఖరం, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, నల్లజర్ల, పోతవరం సొసైటీల అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరే రామకృష్ణ వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

జగన్ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- 15వ వార్డులో గడప గడపకూ..



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ వివిధ పథకాల రూపంలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు వివరించే బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రజలను యథేచ్ఛగా దోచుకున్నారన్నారు. ఆ దోపిడీ సొమ్మును పచ్చ నేతలు పంచుకోవడం తప్ప సామాన్యులకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. అప్పట్లో పథకాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ప్రజల వద్దకే అన్ని రకాల పథకాలూ చేరుతున్నాయన్నారు. మేనిఫెస్టోలోని పేర్కొన్న ప్రతి హామీనీ సీఎం జగన్ నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు మొదలవలస నాగమణి, ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, దాకే అనిల్‌కుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, అహ్మదున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన



పాలంగిలో నిరసన ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

ఉండ్రాజవరం: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చర్యను నిరసిస్తూ మండలంలోని పాలంగి గ్రామ వలంటీర్లు బుధవారం నిరసన తెలిపారు. పవన్ వెంటనే వలంటీర్లందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌరవ వేతనంతో సమాజ సేవ చేస్తున్న వలంటీర్లను రాజకీయ లబ్ధి కోసం దూషించడం నేరమన్నారు. కోవిడ్ సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి తమ విధులను నిర్వహించిన సంగతి పవన్‌కు తెలియదా? అని ప్రశ్నించారు.

డ్రైయిన్ పనులు ప్రారంభం



అవుట్ ఫాల్ డ్రైయిన్ నిర్మాణంలో భాగంగా నందమూరు రోడ్డులో పూడిక తీస్తున్న పొక్లెయిన్

కొవ్వూరు: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టణంలోని అవుట్‌ఫాల్ డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. రూ.రెండు కోట్ల స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులతో చేపట్టిన ఈ నిర్మాణ పనులు మూడు రోజులుగా వేగంగా సాగుతున్నాయి. స్థానిక నందమూరు రోడ్డులో కేజీఎం స్కూల్ దాటిన తర్వాత అపార్ట్‌మెంట్ నుంచి ఒక వైపు , అచ్చాయమ్మ కాలనీ జంక్షన్ సమీపం నుంచి మరో డ్రైయిన్ నిర్మాణం చేపట్టారు. ఒక్కో వైపున 620 మీటర్ల పొడవునా ఈ డ్రైయిన్ నిర్మాణం జరుగుతోంది. గ్రామ శివారు వరకూ ఈ అవుట్ ఫాల్ డ్రైయిన్ నిర్మిస్తున్నారు. 2015 గోదావరి పుష్కరాల సమయంలో ఈ అవుట్‌ఫాల్ డ్రైయిన్ మంజూరైంది. అయితే అప్పట్లో టీడీపీ ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసింది. రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ డ్రైయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఇప్పుడు అవుట్ ఫాల్ డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో వర్షాకాలంలో మురుగు సమస్య కొంత మేర తీరుతుంది. ప్రస్తుతం డ్రైయిన్‌లో ఒక వైపు పూడిక తొలగించే పనులు సాగుతున్నాయి.మరోవైపు మోటార్ల సాయంతో మురుగు నీటిని తోడే పనులు కూడా జరుగుతున్నాయి.

దివ్యాంగ చిన్నారులను బడిలో చేర్పించాలి

చాగల్లు: విద్యకు దూరంగా ఉన్న దివ్యాంగులను బడిలో చేర్పించాలని ఎంఈవో వి.ఖాదర్‌బాబు సూచించారు. స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద గల భవిత కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు బి.రామచంద్రరావు, భవిత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంపై కేసు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలోని లలిత కోడిగుడ్ల అట్టల తయారీ ఫ్యాక్టరీలో ఈ నెల 3న సంభవించిన అగ్ని ప్రమాదంపై బుధవారం కేసు నమోదు చేశామని కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఈ ఘటనపై ఫ్యాక్టరీ ప్రతినిధి గూటం సందీప్ ఫిర్యాదు చేశారని చెప్పారు. అన్ సీజన్ కావడంతో గుడ్ల అట్టలను తయారు చేసి గోదాములో నిల్వ ఉంచామని సందీప్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం సంభవించి గోదాములో భద్రపరిచిన రూ.20 లక్షల విలువైన 42 టన్నుల గుడ్ల అట్టలు కాలిపోయాయని పేర్కొన్నారు. అప్పట్లో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆయిల్‌పామ్, వరి సాగుపై రైతులకు సదస్సు

నిడదవోలు రూరల్: రైతులందరూ ఆయిల్‌పామ్, వరి పంటలపై దృష్టి సారించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని ఏవో జి.సత్యనారాయణ సూచించారు. ఆయిల్ పామ్, వరి సాగుపై కోరుమామిడి గ్రామంలో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీఏసీఎస్, కోరమండల్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రీజినల్ బిజినెస్ హెడ్ కేఎస్ఆర్ చక్రవర్తి మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో సాగు చేపట్టాలన్నారు. ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో కంపెనీ జోనల్ మేనేజర్ కీర్తి కృష్ణ, మార్కెటింగ్, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమస్యల సత్వర పరిష్కారానికే 'సురక్ష'

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి
- పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ
- జోరుగా జగనన్న సురక్ష శిబిరాలు



గోపాలపురం మండలం కరగపాడులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

గోపాలపురం: సమస్యల సత్వర పరిష్కారానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కరగపాడు సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామంలో సారా తయారీ, విక్రయాలు ఎక్కువైపోయాయని గ్రామస్తులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే అరికట్టాలని ఎస్ఈబీ గోపాలపురం అధికారులకు ఆయన సూచించారు. పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే తలారి కుల,ఆదాయ,నివాస ధ్రువ పత్రాలు అందజేశారు.రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, సర్పంచ్ బొమ్మిన నాగమణి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజున, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని అయ్యవరం గ్రామంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ రాజశేఖరం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు ఆయన అందజేశారు. సర్పంచ్ గుడిశె వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంటలో నిర్వహించిన సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే వెంకట్రావు లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, వైఎస్ ఎంపీపీ ఎలమర్తి దుర్గాదేవి,తహసీల్దార్ కె.సతీష్, ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకే..

నిడదవోలు: ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. అర్హులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద గల 9వ సచివాలయంలో బుధవారం 09,15 వార్డులకు సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు లబ్ధిదారులకు 325 కుల ధ్రువీకరణ పత్రాలు, 330 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, గృహసారథుల కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా, కౌన్సిలర్లు మొదలవలస నాగమణి, ఎస్‌కే వజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

